ఊర్వశి

పరమేశ్వరుడు భక్తుల కోర్కెలు సులభంగా తీరుస్తాడని ముల్లోక వాసులకూ తెలిసిందే. ముక్కంటి బోళాశంకరు డనే ప్రతీతి. అయినా ఏ భక్తుడికీ పాశుపతాస్త్రాన్ని ప్రసాదించలేదు. ఆ అస్త్రాన్ని తల్చుకుంటేనే, ఆ అస్త్రం శక్తి యుక్తుల్ని భావిస్తేనే భయాందోళనలు కలుగుతాయి అందరికీ. ఇంద్ర, వరుణ, కుబేరాది దేవతలే ఆ అస్త్రాన్ని సంపాదించలేకపోయారు.

అర్జునుడు పాశుపతాస్త్రాన్ని సంపాదించాడని విన్న దేవలోక వాసులకు ఆశ్చర్యం, భయం కలిగాయి. ఆ భయంతో పాటు అర్జునుని పట్ల అమితమైన భక్తి గౌరవాలు పెరిగిపోయాయి. ఈశ్వర సాక్షాత్కారం పొంది, అపూర్వమైన పాశుపతాస్త్రాన్ని సంపాదించిన మహావీరుణ్ణి దర్శించాలనీ, స్నేహ సంబంధాలు పెంచుకోవాలనీ దేవలోక వాసు లెంతో తహతహలాడిపోయారు.

దేవేంద్రుడు వరుణ, కుబేర, యమధర్మరాజాదులతోనూ, ఇతర దేవతా గణాలతోనూ కలసి అర్జునుణ్ణి చూడటానికి భూలోకాని కేతెంచాడు. తన అంశతో జన్మించి, మహావీరుడై, శౌర్యధనుడైన అర్జునుని చూస్తుంటే స్వర్గాధిపతి మనసు ఆనందవీచికలలో తేలిపోయింది.

అర్జునుడు ఇంద్రాది దేవతలను సాదరంగా ఆహ్వానించి, ఇంద్రునకు పాదాభివందనం చేశాడు.

"పృథాకుమారా! ఈశ్వర కటాక్షంతో పాశుపతం సంపాదించిన నిన్ను అభినందించటానికే స్వర్గం నుంచి దిగి ఇక్కడ కొచ్చాను. దేవలోక వాసులందరూ నిన్ను చూడాలనే కుతూహలంతో ఉన్నారు. నిన్ను అమరావతికి ఆహ్వానిస్తున్నాను. నా దివ్యరథాన్ని పంపుతాను."

ఇంద్రుని మాటలను అర్జునుడు వినమ్రుడై ఆలకించాడు. ఆ శుభసమయంలో వరుణాది దేవతలంతా అక్షయకీర్తి సాధనాలైన పెక్కు అస్త్రాలు బహూకరించారు.

దివ్య పురుషత్వం సాధించిన అర్జునుడు గంగానదీ స్నానం చేసి, నిత్యానుష్ఠానం పూర్తి చేసుకుని, దేవేంద్రుడు పంపిన దివ్యరథారూఢుడై అమరావతికి ప్రయాణం సాగించాడు.

స్వర్గాధిపతి ఇంద్రుడు మహావీరుడైన అర్జునుని ఆహ్వానించాడన్న వార్త అమరావతీ వాసులకి మహోల్లాసాన్ని చేకూర్చింది. అందరి నోటి వెంట అర్జున పాశుపతాస్త్ర సాధన విశేషాలే! ఎవరి నోట విన్నా అర్జునుని రూపసౌందర్య వర్ణనలే! శౌర్యప్రతాప కీర్తనలే!

అప్సరోభామినుల ఆనందానికి అవధులు లేవు. అందరికీ అర్జునుడంటే గౌరవాభిమానాలు పెరిగిపోయాయి.

అర్జునుని గురించి చెప్పుకునే ప్రతి మాటని అమృతబిందువుల్లా ఆస్వాదిస్తోంది అప్సరో శిరోమణి ఊర్వశి. ఇంద్రలోకంలో ఎందరో మహర్షులను, రాజర్షులను, యజ్ఞయాగాది కర్మలు నిర్వర్తించి అపార తపోధనులైన మహనీయులను ఎందరెందరినో చూసింది. వారి గురించి ఎంతగానో వింది. కానీ, ప్రతిభా విశేషాలు, సౌందర్య విలాసాలు, దైవబలం, ఈశ్వర కటాక్షం మొదలైనవన్నీ ఉన్న అర్జునుడు మర్త్యలోకవాసి కావటం ఊర్వశికి కొత్త ఊహల్నీ కొత్త భావాల్నీ మనసులో కలిగించింది. అర్జునుని ఊహాచిత్రం ఆమె మనసులో ముద్ర పడింది. అమరావతీ వాసు లందరికన్నా ఎక్కువగా అర్జునుని రాకకోసం ఎదురుచూస్తున్నది అసమాన సౌందర్యరాశి ఊర్వశి.

అర్జునుడు అమరావతిలో అడుగు పెట్టగానే, కనీ వినీ ఎరుగని స్వాగతోత్సవాలతో ఎదురొచ్చి ఆహ్వానించాడు స్వర్గాధిపతి ఇంద్రుడు. గాఢాలింగనం చేసుకున్నాడు. తన ఆసనంపైన అర్జునుణ్ణి కూచోపెట్టుకున్నాడు. ఇంద్ర సింహాసనాన్ని అలంకరించిన అర్జునుణ్ణి చూస్తుంటే దేవతాగణాలకే ఆశ్చర్యం కలిగింది. అర్జునుడు మరో ఇంద్రునిలా భాసిస్తుంటే అప్సరోభామినులంతా ఆనందంతో పరవశించారు.

సభాకార్యక్రమమయిన తరువాత, తనకని ఏర్పాటుచేసిన మణిమందిరమైన విశ్రాంతి భవనం చేరాడు అర్జునుడు. అప్సరోగణం, యక్ష కిన్నర గంధర్వులు అమర సంగీత వాద్య, నృత్య విశేషాలతో అర్జునుని అలరించారు. సంధ్యాసమయమవుతుంటే ఎక్కడి వారక్కడ నిష్క్రమించారు.

చంద్రోదయమయింది. ప్రశాంత వాతావరణం అర్జునుని మనసుకి ఆహ్లాదజనకంగా ఉంది. అమరావతికి రాగలిగిన తన పుణ్య విశేషాన్ని తల్చుకుని, పాశుపతాస్త్ర సంపాదన భాగ్యాన్ని తల్చుకుని పరవశిస్తున్నాడు మహావీరుడు అర్జునుడు.

అర్జునుని వీరగాథలు, రూపరేఖలు నారదుని నోట విన్న ఊర్వశి ఏనాటి నుంచో అతన్ని ఊహించుకుంటూనే ఉంది. కానీ ఈనాడు ఇంద్రసభలో మరో ఇంద్రునిలా కనిపించిన అర్జునుని రూపం తన ఊహకు కొన్నివేల రెట్లు మిన్నగా ఉంది. ఊర్వశి మనసు చలించింది. ఇంద్రుని పక్కనున్న అర్జునుని పైన నిల్పిన ఆమె చూపులు ఇప్పటికీ వెనక్కి మరలటం లేదు. అతని పొందు కోసం తహతహలాడుతున్న ఊర్వశి ఏకాంతంగా అతన్ని సమీపించటానికి సమయంకోసం ఎదురుచూస్తోంది.

ఎటుచూసినా వెన్నెలే. మన్మథ పరవశురాలైన ఊర్వశి అర్జునుని సాంగత్యం కోరి వేగంగా మణిమందిరం చేరాలని తలచింది.

చంద్రుని వెన్నెల వస్త్రాన్ని ధరించింది. కస్తూరిని శరీరానికి పూసుకొంది. నల్లని కేశపాశంలో సుగంధ కుసుమాలు అలంకరించుకుంది. మణిమయ భూషణాలు సవరించుకుంది. కాలి గజ్జెల రవళులు, చేతి కంకణాల గలగలలూ కలసి మధురంగా వినిపిస్తుంటే, మెరుపుతీగలా ప్రకాశిస్తూ, అర్జునుని మందిరంలో అడుగు పెట్టింది అప్సరోభామిని ఊర్వశి.

వెంటనే ఆమెను గుర్తించాడు అర్జునుడు, ఆ అసమాన సౌందర్యమూర్తిని ఊర్వశిని.

"జననీ, పుత్రవాత్సల్యంతో నన్ను చూడటానికి వచ్చినందుకు ధన్యవాదాలు!" అర్జునుడు ఊర్వశి పాదాలకు అభివాదనం చేశాడు.

ఊర్వశి నివ్వెరపోయింది. ఆ మాటలు ఆమెకు బాణాల్లా తగిలాయి. అర్జునుని సంబోధన ఆమె చెవుల్లో మారుమోగింది. కానీ, అర్జునుడు తన మనసు తెలుసుకోలేక అలా అని ఉంటాడని సమాధానపర్చుకుంది.

"అర్జునా, నీ కీర్తి ప్రఖ్యాతులు ఏనాడో విన్నాను. నీ రూపరేఖా సౌందర్యాలూ విన్నాను. నేడు ప్రత్యక్షంగా కన్నాను. నా మనసు నీమీద లగ్నమయింది. నా వలపు దాచుకోలేను. అనుక్షణం నీ పొందుకోరుతున్న నా అభి

లాష తీర్చు. నా భావోద్రేకం నన్ను ఒంటరిగా నిలవనీయక నీ చెంత చేర్చింది. ఇప్పటికి నా మనసు తెలిసిందిగా?"

ఊర్వశి క్రీగంట చూస్తోంది. అర్జునుని సౌందర్యాన్ని నేత్రాంతాలతో ఆస్వాదిస్తోంది.

అతని ముఖంలో ప్రసన్నత మాయమైంది. చూపుల్లో నిశితత్వం చోటు చేసుకుంది.

"జననీ అని సంభోధించటం నీకు తగదు." ఊర్వశి గొంతు అర్జునుని కలవరపరిచింది.

"నేను ధర్మమే పల్కాను. మావంశకర్తయైన పురూరవునకు భార్యగా వ్యవహరించావు నీవు. నా తండ్రియైన దేవేంద్రునికి పరిచర్యలుచేస్తూ, ప్రియురాలిగా ఉన్నావు. అందుచేత నువ్వు నాకు మాతృస్థానీయురాలివే. అందుకే మరి 'జననీ' అన్నాను."

అర్జునుని వాక్కులు గంభీరంగా వినిపిస్తూంటే ఊర్వశి చమత్కారంగా నవ్వింది.

"నీకు తల్లి నెట్లా అయ్యాను? మీ మర్త్యలోకపు పోకడలు మరిచిపో. మర్త్యలోకపు వావివరుసలు మాకు లేవు. మేము నిత్యయౌవనులం. ఇక్కడ ఇతర సంబంధాలు లేవు. మర్త్యలోకపు ధర్మాలు ఇక్కడ చెల్లవు... నువ్వు దివ్యపురుషత్వం పొంది, స్వర్గాని కొచ్చాక మా ధర్మాలే పాటించాలి. తెలుసా? ఇది తప్పు కాదు, పాపం కాదు. ఇది దేవలోకం, ఇది స్వర్గం."

ఊర్వశి చూపులు అర్జునుని ముఖంపైన నిల్చాయి. త్రిలోకాలలో తన పొందు కోరని పురుషుడే లేడనే గర్వం ఉన్న ఊర్వశి కళ్ళలో, ఉన్నట్టుండి అగ్నిజ్వాలలు లేచాయి. నిర్వికారంగా ఉన్న అర్జునుని చూస్తుంటే ఊర్వశి ఆవేశం కట్టలు తెంచుకుంటూంది. అప్సరసల సౌందర్యాన్నంతా మించి ఉండాలని తనని ప్రత్యేకంగా సౌందర్యరాశిలా సృష్టించాడు నారాయణ మహర్షి ఆనాడు. ఈనాడు ఈ నరుడు తన సౌందర్యాన్ని, తన కోరికని తిరస్కరించటమా?

ఊర్వశి సొగసు కాని, ప్రలోభపరిచే అవయవ విన్యాసం కాని, శరీరచ్ఛాయ కానీ, ఆమె దివ్యాంబరాభరణాలు కానీ, ఏవీ అర్జునునికి వికారం కలిగించటంలేదు.

ప్రశాంతచిత్తుడై, నిర్మల మనస్కుడై అచంచల భక్తి గౌరవాలతో ఊర్వశిని చూస్తూ, "కర్మభూమిని జన్మించి, కర్మరుడనైన నాకు ఇచ్చటి ఆచారాలతో పనిలేదు ... నన్ను క్షమించు తల్లీ!" అని ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

ఊర్వశి నిరాశ, అవమానం, కోపం ఆవేశాలతో ఊగిపోతూ, ఉగ్ర రూపం దాల్చింది.

"నాకు నిరాశ కల్గించటమేకాక, తల్లీ అని నన్ను సంబోధించి అవమాన పర్చావు, నా మనసుని బాధించావు. నీ మర్త్యలోకంలో స్త్రీ జనాలమధ్య అవమానితుడవై, నపుంసకుడవై జీవించు!"

ఊర్వశి మధురాతి మధురమైన సుస్వరం ఆ క్షణాన అశనిపాతమైంది అర్జునునికి.

ప్రభాతమైంది. ఊర్వశి శాపం ఇంద్రునికి తెలిసిన క్షణం నిశ్చేష్టుడయ్యాడు. అర్జునుని సచ్ఛీలతకి, నిగ్రహానికి దేవేంద్రుడు చాలా ఆనందించాడు. తాత్కాలిక ఆవేశంతో శపించినా ఊర్వశి పశ్చాత్తప్తురాలు కాదా? - ఇంద్రుడు వెంటనే అర్జునుని మందిరానికొచ్చాడు.

"నీమీది ప్రేమ విఫలమైందనే కోపంతో ఊర్వశి ఇచ్చిన ఈ శాపం నీకు వరమే అవుతుంది."

అర్జునుని కళ్ళలో చిన్న మెరుపు నిలిచింది.

"నిజమే! అజ్ఞాతవాస సమయంలో నిన్ను ఈ శాపమే కాపాడుతుంది. ఆ ఒక్క సంవత్సరమే ఈ శాపప్రభావం." కుమారుని గాఢంగా కౌగలించుకున్నాడు ఇంద్రుడు.

అర్జునుని మనసు తేలికపడింది. ప్రేమతో ఇచ్చే శాపం కొన్ని సందర్భాలలో వరమవుతుంది కాబోలు!

మహావీరుడు అర్జునుడు దేవేంద్రుని పాదాలు ఆనంద బాష్పాలతో అభిషేకించాడు. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం:
అరణ్య పర్వం : తృతీయాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 4.5.1988)